## విద్యా - ఉద్యోగ సమాచారం

### ● ఎస్సీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

హైదరాబాద్, మార్చి23 (నమస్తే తెలంగాణ): డీఎస్సీకి సన్నద్ధమవుతున్న నిరుద్యోగ ఎస్సీ అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్టు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 26లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకొని, కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలు మించని అభ్యర్థులు శిక్షణకు అర్హులని చెప్పారు. గతంలో ఉచిత శిక్షణ పొందిన అభ్యర్థులు అనర్హులని స్పష్టంచేశారు.

### ● గేట్ కటాఫ్ మార్కులు విడుదల

హైదరాబాద్, మార్చి23 (నమస్తే తెలంగాణ): గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ పరీక్ష (గేట్)కు సంబంధించి కటాఫ్ మార్కులను శనివారం విడుదల చేశారు. బెంగళూరు ఐఐఎస్సీ ఫిబ్రవరి 3, 4, 10, 11న ఈ పరీక్ష నిర్వహించగా, ఇప్పటికే తుది ఫలితాలను వెల్లడించింది. తాజాగా కటాఫ్ మార్కులతో పాటు తుది ఫలితాల స్కోరు బోర్డును కూడా విడుదల చేసింది.

### ● గ్రూప్-4లోనూ సమాంతర రిజర్వేషన్లు

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-4 పోస్టుల భర్తీపై సమాంతర రిజర్వేషన్ల ప్రభావం పడింది. గత నెల 10న మహిళా శిశు సంక్షేమ శాఖ జీవో 3, జీఏడీ జీవో 35 జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వుల మేరకు గ్రూప్-4 పోస్టుల రోస్టర్ విధానంలో మార్పులు చోటుచేసుకొన్నాయి. గతంలో వెల్లడించిన రోస్టర్ విధానాన్ని ఉపసంహరించారు. కొత్తగా రోస్టర్ విధానాన్ని టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. గ్రూప్-4 నోటిఫికేషన్ 2022 డిసెంబర్ 1న జారీ కాగా, ఇందులో మొత్తం 8,180 ఉద్యోగాలు ఉన్నట్టు పేర్కొన్నారు.

### ● 31 వరకు సీసీఎంబీలో పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ) : పీహెచ్‌డీలో ప్రవేశాలకు అర్హులైన వారు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) సంస్థ తెలిపింది. డెవలప్‌మెంటల్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, జినోమిక్స్, ఏపీజెనెటిక్ రెగ్యులేషన్, సెల్, స్టెమ్ సెల్ బయాలజీ, మైక్రోబెస్, బయాలజీ ఆఫ్ ఇన్‌ఫెక్షన్, వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ అండ్ ఏకాలజీ, క్రాప్ ఇంప్రూవ్‌మెంట్ వంటి అంశాల్లో పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పించినట్టు సంస్థ వివరించింది.

### ● స్పోర్ట్ కోటా అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫకేషన్

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ ) : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాలలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్(ఏఈఈ) ఉద్యోగాలకు స్పోర్ట్స్ కోటా అభ్యర్థులను భర్తీ చేయనున్నారు. ఇందులోభాగంగా ఏప్రిల్ 3, 4న ఉదయం 11 నుంచి స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు. పోస్టుల వారీగా ఎంపికైన అభ్యర్థుల వివరాలు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

### ● ఏప్రిల్ 1 నుంచి టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్ల శిక్షణ

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : టీఎస్ఎస్పీకి ఎంపికైన కానిస్టేబుళ్లకు ఏప్రిల్ 1 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, ఏడీజీ అభిలాష బిస్త్ శనివారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ బెటాలియన్లలో 4,250 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చేందుకు మౌలిక సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. ఇప్పటికే https://tssp.telangana.gov.in వెబ్‌సైట్‌లో అభ్యర్థుల వివరాలు, హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

### ● సీయూఈటీ (యూజీ)లో మరో రెండు పేపర్లు

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : సీయూఈటీ (యూజీ)లో మరో రెండు పేపర్లు చేరాయి. కొత్తగా ఫ్యాషన్ స్టడీస్, టూరిజం సబ్జెక్టులను చేర్చినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించింది. సీయూఈటీ (యూజీ)లో 29 సబ్జెక్టులు, 33 భాషలున్నాయి. తాజాగా మరో రెండు చేరడంతో వీటి సంఖ్య 31కి చేరింది. ఈనెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే అవకాశం ఉన్నది. దేశవ్యాప్తంగా మే 15 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సీయూఈటీ స్కోర్ ఆధారంగా దేశవ్యాప్తంగా 200 యూనివర్సిటీల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

### ● పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

**సీఎంకు మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవీందర్ వినతి**

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : పెండింగ్‌లోని మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు బీ మోహన్‌రెడ్డి, పూల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో వారు పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డితో కలిసి పలు ఉపాధ్యాయ సమస్యలపై వినతిప్రతం అందజేశారు. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు, జీవో -317 బాధితుల సమస్యలు, పండిట్, పీఈటీల పదోన్నతుల సమస్య పరిష్కరించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని పూల రవీందర్ తెలిపారు.

### ● డిజిటలైజేషన్ దిశగా ఎస్‌సీఆర్

**ఏటీవీఎం, యూటీఎస్ ద్వారా అన్-రిజర్వ్‌డ్‌లో 44శాతం టికెట్ కొనుగోళ్లు**

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : రైల్వే టికెట్ల జారీలో ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్, యూటీఎస్ యాప్ వంటి వాటి ద్వారా అన్ రిజర్వ్‌డ్ టికెట్ బుకింగ్‌లో దక్షిణ మధ్య రైల్వే జోన్ 44 శాతం కొనుగోళ్లు సాధించినట్లు శనివారం రైల్వే అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ డిజిటలైజేషన్ దిశగా నిరంతరంగా కృషి చేస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం జోన్ వ్యాప్తంగా మొత్తం 147 ప్రధాన రైల్వే స్టేషన్లలో 300కు పైగా ఏటీవీఏంలు ఏర్పాటు చేశామని రైల్వే అధికారులు చెప్పారు.

### ● స్థానికులకు, ప్రభుత్వ ఇండ్లకు ఇసుక ఉచితం

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): స్థానికులకు, ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా వినియోగించుకొనేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన జీవో 3లోని నిబంధనలను అమలు చేయాలని శనివారం గనుల శాఖ కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇసుక క్వారీలు ఉన్న గ్రామాల ప్రజలకు, ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఉచితంగా తీసుకోవచ్చని పేర్కొన్నారు. అవగాహన, నిబంధనలు తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే కలెక్టర్లకు గనుల శాఖ మరోసారి ఈ ఆదేశాలు జారీ చేసింది.

# టెట్‌లో నార్మలైజేషన్ ఉందా.. లేదా?

- **కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్ష**
- **ఒకే సబ్జెక్టుకు రెండు.. మూడు సెషన్లల్లో పరీక్షలు**
- **ఈజీగా వస్తే లాభం.. కఠినంగా వచ్చిన వారికి నష్టం**
- **నోటిఫికేషన్‌లో నార్మలైజేషన్‌పై స్పష్టతివ్వని విద్యాశాఖ**

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పలు వివాదాలకు కేంద్రంగా మారుతున్నది. ఇప్పటికే ఫీజుల పెంపుతో అభ్యర్థుల నడ్డివిరిచిన సర్కారు.. నోటిఫికేషన్‌లో నార్మలైజేషన్‌పై స్పష్టత ఇవ్వకపోవడం మరో వివాదానికి కారణమైంది. టెట్‌లో నార్మలైజేషన్ ఉంటుందా? ఉండదా? అనే సందేహాలు అభ్యర్థులను పట్టిపీడిస్తున్నాయి. టెట్ నోటిఫికేషన్‌లో నార్మలైజేషన్‌పై విద్యాశాఖ ఎలాంటి స్పష్టతనివ్వలేదు. టెట్‌ను తొలిసారిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించబోతున్నారు. మే 20 నుంచి జూన్ 3 వరకు 15 రోజులపాటు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఒక్కో సెషన్‌లో 30 -35 వేల మందికి మాత్రమే పరీక్షను నిర్వహించే వీలుంది. ఒకే సబ్జెక్టుకు రెండు, మూడు సెషన్లల్లో పరీక్షలు నిర్వహించే అవకాశముంది. ఒక పేపర్ ఈజీగా.. లేదా మధ్యస్తంగా.. మరో పేపర్ కఠినంగా వస్తే ఆయా సెషన్‌లో పరీక్షకు హాజరైన వారికి ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. సులభంగా ప్రశ్నలొచ్చిన వారికి లాభం జరగగా, కఠినంగా వచ్చినవారికి నష్టం కలిగే అవకాశమున్నది. ఇంతటి కీలకమైన విషయంపై విద్యాశాఖ స్పష్టతనివ్వకపోగా, ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించడం గమనార్హం. గతంలో టెట్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించడం వల్ల అభ్యర్థులందరికీ ఒకే ప్రశ్నపత్రాన్నిచ్చేవారు. పేపర్ల మూల్యాకంనంలో ఇబ్బందులొచ్చేవి కాదు. కానీప్పుడు ఆన్‌లైన్‌లో నిర్వహించడంతో కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై విద్యాశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారిని సంప్రదించగా.. ఇప్పటి వరకు నార్మలైజేషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.

**అన్నింటా అమలు..**

ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్షలన్నింటిలోనూ నార్మలైజేషన్ విధానం అమవుతున్నది. మరి ఇలాంటప్పుడు టెట్‌కెందుకు లేదన్న ప్రశ్నలు అభ్యర్థుల నుంచి వినిపిస్తున్నాయి. జాతీయంగా నిర్వహించే జేఈఈ మొదలుకొని.. టీఎస్‌పీఎస్సీ, గురుకుల నియామక పరీక్షలన్నింటిలో నార్మలైజేషన్‌ను అమలుచేస్తున్నారు. ఇటీవల ఏపీ టెట్‌లోను ఈ విధానాన్ని అనుసరించారు. నార్మలైజేషన్‌లో భాగంగా సులభంగా వచ్చిన పేపర్లను, కఠినంగా వచ్చిన పేపర్లను అంచనావేసి సరాసరి మార్కులేస్తారు. ఈ విధానంలో సులభంగా వచ్చిన వారికి కొన్ని మార్కులు కోత విధించి, కఠినంగా వచ్చిన వారికి కొన్ని మార్కులు కలుపుతారు. ఇది ప్రశ్నల తీరును బట్టి.. సబ్జెక్టు నిపుణుల విచక్షణ మేరకే జరుగుతుంది.

**డీఎస్సీలోనైనా ఉండేనా..?**

టెట్ పరిస్థితి ఇలా ఉండగా కీలకమైన టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ అయిన డీఎస్సీలోనైనా నార్మలైజేషన్ ఉంటుందా.. ఉండదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. డీఎస్సీ పరీక్షలను సైతం ఈ సారి కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తున్నారు. దీంట్లోను నార్మలైజేషన్ చేయాల్సి ఉంటుంది. కానీ, దీనిపైనా విద్యాశాఖ స్పష్టతనివ్వలేదు. ప్రభుత్వం చొరవ తీసుకొని, అటు. టెట్‌కు.. ఇటు డీఎస్సీలో నార్మలైజేషన్ అమలుపై స్పష్టతనివ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.



మంచిర్యాలలో ధర్నా నిర్వహిస్తున్న బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు

## టెట్ ఫీజుపై అభ్యర్థుల కన్నెర్ర

- **రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు**

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): టెట్ ఫీజులను అడ్డగోలుగా పెంచడంపై అభ్యర్థులు కన్నెర్రజేశారు. అనాలోచితంగా 150-300 శాతం ఫీజులను పెంచడంపై మండిపడ్డారు. రూ.400 ఉన్న టెట్ ఫీజులను వెయ్యి.. రెండు వేలకు పెంచడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగారు. భారీగా తరలివచ్చిన బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు మంచిర్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ ఎదుట ధర్నాను నిర్వహించారు. కరీంనగర్‌లోనూ ఉపాధ్యాయ ఉద్యోగార్థులు, టెట్ అభ్యర్థులు ఆందోళనకు దిగి రాష్ట్ర ప్రభుత్వ చర్యలను నిరసించారు. వనపర్తిలోని సురవరం ప్రతాపరెడ్డి స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట అభ్యర్థులు ధర్నా చేశారు. పెంచిన ఫీజులను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు.

## టెట్ ఫీజు తగ్గించాలి

- **సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ లేఖ**



హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు ఫీజు పెంపుతో పేద, మధ్యతరగతి అభ్యర్థులపై అధిక భారం పడుతుందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో టెట్ ఒక పేపర్‌కు దరఖాస్తు ఫీజు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఫీజుగా నిర్ణయించామని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం టెట్ పేపర్-1కు రూ.1,000, రెండు పేపర్ల ఫీజును రూ.2,000 పెంచడం సరికాదని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి బాల్కసుమన్ లేఖ రాశారు. కేవలం 11 జిల్లా కేంద్రాల్లోనే టెట్ పరీక్ష ఉంటుందని ప్రకటించారని, దీనివల్ల మిగతా జిల్లాల అభ్యర్థులకు దూరభారంతోపాటు ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటారని తెలిపారు. మొత్తం 33 జిల్లాల్లోనూ పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడు లక్షల మంది నిరుద్యోగుల సమస్యను పరిగణనలోకి పెంచిన టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలని కోరారు.

## మహిళ హత్య

**నకిలీస్వామిజీ అరెస్టు..**

గుమ్మడిదల, మార్చి 23: మహిళను హత్య చేసిన నకిలీస్వామిజీని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పరిధిలోని వీరన్నగూడెంకు చెందిన బుచ్చమ్మకు.. యాదాద్రి భువనగిరి జిల్లా వెంకిర్యాలకు చెందిన తత్తరి నర్సింగ్ రామ్ శివ స్వామిజీగా పరిచయమయ్యాడు. పూజలు చేస్తానని నమ్మించి గత నెల 13న బుచ్చమ్మ (60)ను సికింద్రాబాద్ తీసుకెళ్లి పూజ సామాన్లను కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి ఘట్‌కేసర్ పరిధి మాదారం శివారులో పూజలు చేస్తున్నట్టు నటిస్తూ బంగారు గొలుసును తీయాలని అడగగా.. ఆమె నిరాకరించింది. దీంతో బుచ్చమ్మను చంపి బంగారు గొలుసుతో పారిపోయాడు. పోలీసులు నకిలీ స్వామీజీని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

## గణితం గ్రాఫ్‌పేపర్ ఇవ్వలే

- **మెయిన్ ఆన్సర్‌షీట్‌లోనే గ్రాఫ్‌లు వేయాల్సిన పరిస్థితి**
- **హైదరాబాద్ జిల్లా రేడియంట్ స్కూల్ పరీక్షాకేంద్రంలో ఘటన**
- **విధుల నుంచి ఇద్దరు సీఎస్‌డీవోల తొలగింపు**

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): పదోతరగతి పరీక్షల్లో రోజుకో వివాదం వెలుగుచూస్తున్నది. తాజాగా అధికారులు, పరీక్షల నిర్వహణాధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఓ పరీక్షాకేంద్రంలోని విద్యార్థులకు గణితం గ్రాఫ్ పేపర్లు అందలేదు. చివరికి మెయిన్ ఆన్సర్‌షీట్‌లోనే గ్రాఫ్ వేయించి చేతులు దులుపుకొన్నారు. శనివారం పదోతరగతి గణితం పేపర్ పరీక్ష నిర్వహించారు. హైదరాబాద్ జిల్లాలోని రేడియంట్ స్కూల్ పరీక్షకేంద్రంలోని విద్యార్థులకు గ్రాఫ్ పేపర్ అందలేదు. ఎస్సెస్సీబోర్డు నుంచి గ్రాఫ్ పేపర్ రాకపోగా, పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు (సీఎస్ డీవో) ఈ విషయాన్ని చూసుకోలేదు. విద్యార్థులు గ్రాఫ్ పేపర్ కావాలని అడగ్గా, ఎస్సెస్సీ బోర్డు పంపించిన మెటీరియల్లో వెతకగా గ్రాఫ్ పేపర్లు లేకపోవడంతో కొంతసేపు గందరగోళం నెలకొన్నది. దీంతో అప్పటికప్పుడు మెయిన్ ఆన్సర్‌షీట్స్‌లోనే గ్రాఫ్ వేయించారు. ఇందుకు ఇద్దరు సీఎస్‌డీవోలదే బాధ్యత అని తేల్చిన అధికారులు వారిని పరీక్ష విధుల నుంచి తప్పించారు. వీరి స్థానంలో మరో ఇద్దరు టీచర్లకు బాధ్యతలు అప్పజెప్పారు. ఇక రంగారెడ్డి జిల్లాలో ఓ పరీక్షాకేంద్రానికి కేటాయించిన కస్టోడియన్ మరో పరీక్షాకేంద్రంలో అదనపు ఆన్సర్‌షీట్స్ కోసం వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా మరో సెంటర్‌కు వెళ్లడాన్ని సీరియస్‌గా పరిగణించి విధుల నుంచి తప్పించారు. ఇదే జిల్లాలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారికి కూడా విధుల నుంచి తొలగించారు. శనివారం గణితం పరీక్షకు 4,95,293 మంది విద్యార్థులకుగాను 4,93, 652 (99.67శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక ప్రైవేట్ విద్యార్థుల్లో 6,096 మందికి, 5,301 (87.35శాతం) మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు అధికారులు వెల్లడించారు.

## 100 రోజుల్లో ఒక్క గ్యారెంటీ అమలు కాలేదు

**ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్**

నీలగిరి, మార్చి 23: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా.. ఒక్క గ్యారెంటీ అమలు చేయలేదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ విమర్శించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు పైసలు రూ.5 వేల కోట్లు పొంగులేటి ఖాతాలో వేశారని, ఆయన ఏక్‌నాథ్ షిండే కానున్నారని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో నీటి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తెసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని చోట్లా ప్రజాశాంతి పార్టీ పోటీ చేస్తుందని, విశాఖపట్నం నుంచి తాను బరిలో ఉంటానని చెప్పారు.



గాంధీభవన్ ఎదుట ఆందోళన చేస్తున్న పెద్ది కృష్ణమూర్తి వర్గం

## ఎమ్మెల్యే అత్త పెత్తనం మాకొద్దు

- **గాంధీభవన్‌లో పాలకుర్తి కాంగ్రెస్ కలహాలు .. ఉద్రిక్తత**

హైదరాబాద్, మార్చి 23(నమస్తే తెలంగాణ)/దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌లో కలహాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డికి వ్యతిరేకంగా నియోజకవర్గ కార్యకర్తలు హైదరాబాద్ గాంధీభవన్‌కు శనివారం పెద్ద ఎత్తున వాహనాల్లో తరలివచ్చారు. కార్యాలయ ఆవరణలో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఝాన్సీరెడ్డి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు నేతలు ధ్వజమెత్తారు. దేవరుప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తిని తొలగించడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి నామమాత్రం అయ్యారని, ఇటు పార్టీలో, అటు ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ యశస్వినీరెడ్డి అత్తగారైన ఝాన్సీరెడ్డే పెత్తనం చెలాయిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి డౌన్‌డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వారు వినతిపత్రం అందజేశారు. సమస్యను సీఎంకు వివరించి పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## కొండగట్టు ఆలయ ఈవో సస్పెన్షన్

- **ఖాతాల నిర్వహణ, పర్యవేక్షణలో నిర్లక్ష్యం**
- **ఇప్పటికే పలువురు ఉద్యోగులకు మెమోలు**

**నమస్తే ఎఫెక్ట్**

మల్యాల, మార్చి 23: తీగె లాగితే డొంక కదిలిన చందంగా కొండగట్టు ఆలయ దుకాణాల లీజ్ వ్యవహారంలో ఒక్కొక్కటిగా అక్రమాల గుట్టు బయటకు వస్తున్నది. తాజాగా ఈవో టంకశాల వెంకటేశ్ సస్పెండ్ అయ్యారు. షాపుల కేటాయింపులో అక్రమాలపై ఈ నెల 18న 'నమస్తే తెలంగాణ'లో 'దుకాణాల లీజులో గోల్‌మాల్' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికార యంత్రాంగం కదిలింది. దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశాల మేరకు దేవాదాయశాఖ అదనపు కమిషనర్ జ్యోతి విచారణ జరిపి నివేదిక సమర్పించగా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇప్పటికే పలువురు ఆలయ ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. తాజాగా శనివారం ఏకంగా ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్‌ను సస్పెండ్ చేశారు. ఆలయ ఖాతాల నిర్వహణ, పర్యవేక్షణపై నిర్లక్ష్యంతోనే ఈవోను విధుల నుంచి తొలగించారు.

**ఆగమేఘాల మీద విచారణ**

దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఈ నెల 19న కొండగట్టుకు చేరుకున్నారు. కార్యాలయంలోని లీజుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నగదు వ్యవహారాల్లో రికార్డులు సరిగా లేకపోవడం, ఈవో పర్యవేక్షణ లోపంతోనే లీజు ద్వారా వచ్చిన నగదును ఆలయ ఖాతాల్లో జమ చేయలేదని నిర్ధారించారు. గతంలో చేపట్టిన ఆడిట్ అభ్యంతరాలను సైతం పరిశీలించకపోవడం, రీక్యాన్సిలేషన్ చేయకపోవడంలో ఈవో నిర్లక్ష్యం చూపారని ప్రాథమికంగా తేల్చారు. ఈనెల 21న దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక అందజేశారు. ఇందులో 2007-08 ఆర్థిక సంవత్సరం నుంచి 2017-18 వరకు రూ.14.56 కోట్ల విలువైన ఆడిట్ అభ్యంతరాలను రీక్యాన్సిలేషన్ చేయకపోవడం, 2018-19లో రూ.59.18 లక్షల అభ్యంతరాలు రీక్యాన్సిల్ చేయకపోవడం, రూ.17.61 లక్షలు నగదు పుస్తకంలో నమోదు చేసిన బ్యాంకులో జమకాలేదని వెల్లడించారు. ఈవో నిర్లక్ష్యంతోనే ఆలయ పరిధిలోని ఓ ఉద్యోగి రూ.52 లక్షలు కాజేసినట్టు గుర్తించారు. 2023-24లో ఆలయ ఖాతా పుస్తకంలో రూ.4.93 కోట్లు నమోదు చేయగా, బ్యాంకులో 4.81 కోట్లు మాత్రమే జమయ్యాయని, రూ.11.55 లక్షలు డిపాజిట్ చేయలేదని వెల్లడించారు. ఈవో ఆడిట్ అభ్యంతరాలను పక్కన పెట్టడం, ఓ ఉద్యోగి రూ.52.39 లక్షలు కాజేయడం, 9 నెలలుగా రికార్డుల పరిశీలన చేయకపో వడంతో పరిపాలన గాడి తప్పిందని విచారణలో గుర్తించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ ఈవోను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.



ఈవో టంకశాల వెంకటేశ్

## 6,925 కిలోల పేలుడు సామగ్రి పట్టివేత

- **తరలిస్తున్న డీసీఎం వాహనం సీజ్**
- **ఐదుగురు అరెస్టు: డీసీపీ వెల్లడి**

బీబీనగర్, మార్చి 23 : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పోలీసులు శనివారం 6,925 కిలోల పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ రాజేశ్‌చంద్ర వివరాల ప్రకారం.. గూడూరు టోల్‌గేటు వద్ద ఎస్సై ఎన్ రమేశ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న డీసీఎంలో పేలుడు పదార్థాలు గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మొల్గర గ్రామానికి చెందిన బయ్యపు హనుమంత రెడ్డి శ్రీసాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో పేలుడు పదార్థాల వ్యాపారం చేస్తున్నాడు. హనుమంతరెడ్డి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొండాపూర్‌కు చెందిన పెదవీడు నర్సింహులు తన యజమాని ఆదేశాల మేరకు కొండాపూర్‌లోని శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ నుంచి 6,925 కిలోల పేలుడు పదార్థాలను డీసీఎంలో రవాణా చేస్తున్నాడు. ఈ కేసుతో సంబంధం ఉన్న శ్రీసాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని బయ్యపు హనుమంతరెడ్డి, శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ యజమాని దేవేందర్‌రెడ్డి, మేనేజర్ దత్తురావు, అకౌంటెంట్ పరశురాములు, డీసీఎం డ్రైవర్ నర్సింహులును అరెస్టు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీసీపీ పేర్కొన్నారు.

## గంజాయి దందా గుట్టురట్టు

- **జగిత్యాలలో పది కిలోల పట్టివేత**
- **పోలీసుల అదుపులో ఐదుగురు..**

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 23: జగిత్యాలలో గంజాయి దందా గుట్టురట్టయింది. పది కిలోల సరుకును రవాణా చేస్తూ ముఠా పోలీసులకు చిక్కింది. పట్టుబడిన ఐదుగురు యువకులను జగిత్యాల పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. రాయికల్ వడ్డెర కాలనీకి చెందిన పెనుగొండ గణేశ్.. 2015లో హైదరాబాద్‌లో బీటెక్ చేస్తున్న సమయంలో ఫ్రెండ్స్‌తో గంజాయి తాగడం అలవాటు చేసుకున్నాడు. రాయికల్ సమీపంలోని అల్యానాయక్ తండాకు చెందిన మాలావత్ సతీశ్‌కుమార్, కుమ్మరిపెల్లికి చెందిన తోట అజయ్, ఉప్పుమడుగుకు చెందిన ఆవుల సాగర్, మల్లాపూర్ మండలం రేగుంటకు చెందిన రావులకారి నితిన్‌తో పరిచయం చేసుకున్నారు. వారికి కూడా గంజాయి తాగడం అలవాటు ఉండటంతో మంచి మిత్రులయ్యారు. ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 19న మళ్లీ గణేశ్, సతీశ్ కలిసి బైక్‌పై సీలేరు వెళ్లి మరో 10 కిలోలు కొనుక్కొని వచ్చారు. అందులో నాలుగు కిలోలు నితిన్‌కు విక్రయించారు. మిగిలిన ఆరు కిలోలను ఇతరులకు విక్రయించేందుకు ఇద్దరూ కలిసి ఇటిక్యాల శివారులో మామిడి తోటకు వెళ్తుండగా రాయికల్ శివారులో పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. ఇక తాను కొనుగోలు చేసిన నాలుగు కిలోల గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయించేందుకు రేగుంట నుంచి మల్లాపూర్ వైపు నితిన్ వెళ్తుండగా.. మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ పట్టుకున్నారు. వీరు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి అమ్ముతున్న అజయ్, సాగర్‌ను అరెస్ట్ చేసినట్టు వివరించారు. మొత్తంగా రెండు కేసుల్లో 10 కిలోల గంజాయిని, రెండు బైకులు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను కోర్టుకు తరలించినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్ ఉన్నారు.




జగిత్యాలలో నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

### సెన్సేషన్ కోసం వార్తలు రాయొద్దు: ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

గంజాయి వినియోగంపై రెండ్రోజులుగా వివిధ పత్రికల్లో (నమస్తే తెలంగాణ కాదు) వచ్చిన వార్తలపై ఎస్పీ స్పందించారు. జగిత్యాల పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, పరిశీలన చేయకుండా పూర్తిగా రెచ్చిపోయేలా వార్తలు రాశారని తెలిపారు. సెన్సేషన్ క్రియేట్ చేయడం కోసం రాసినట్టుగా ఉన్నాయని పేర్కొన్నారు. సమాజంలో జరిగే మంచి చెడులను బయటకు తీసుకొచ్చి ప్రజలకు తెలపాలని, సెన్సేషన్, వ్యూయర్‌షిప్ పెంచుకోవడానికి సమాజానికి చెడును చూపవద్దని మీడియాను కోరారు. మీడియాలో వస్తున్న వార్తలపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నామని, త్వరలోనే అన్ని విషయాలను మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు.

## మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా

- **పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహిద్దాం**
- **తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమావేశం**

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా ఉండాలని తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమావేశంలో నిర్ణయించారు. మూడు రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులతో గడ్చిరోలి ఎస్పీ క్యాంపు ఆఫీస్‌లో డీఐజీ అంకిత్ గోయల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రామగుండం కమిషనర్, ఐజీ ఎం శ్రీనివాస్ అధ్యక్షత వహించి.. రాబోయే ఎన్నికలకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి చర్చించారు. చెక్ పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించి, మావోయిస్టుల కదలికలపై మూడు రాష్ట్రాల పోలీసులు పరస్పరం సమాచారాన్ని సమన్వయం చేసుకోవాలని నిర్ణయించారు. సమస్యాత్మ గ్రామలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నాన్ బెయిలబుల్ వారెంట్ల విషయంలో మూడు రాష్ట్రాల పోలీసులు సహకరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లా పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## 'రేషన్' పంపిణీ తేదీల్లో గందరగోళం

- **1-15లోపు ముగించాలని డీలర్లకు ఆదేశాలు**
- **సమాచారం లేక షాపులకు లబ్ధిదారుల ప్రదక్షిణలు**

హైదరాబాద్, మార్చి 23(నమస్తే తెలంగాణ): పౌరసరఫరాల శాఖ నిర్ణయంతో రేషన్ పంపిణీలో గందరగోళం నెలకొన్నది. గతంలో ప్రతినెలా 3 లేదా 5 నుంచి ప్రారంభించి 23 నుంచి 25 వరకు దుకాణాల్లో సరుకులను పంపిణీ చేసేవారు. అవసరాన్ని బట్టి గడువును పొడిగించేవారు. ఈ మార్చి నెల నుంచి పంపిణీ తేదీల్లో పౌరసరఫరాల శాఖ మార్పులు చేసింది. ఒకటో తేదీన ప్రారంభించి 15 వరకే పంపిణీ ముగించాలని అన్ని జిల్లాలకు సర్క్యులర్ జారీ చేసింది. అయితే సరుకుల పంపిణీ గడువు కుదించారనే విషయం ప్రజలకు చేరలేదు. కేవలం అంతర్గతంగా సర్క్యులర్ జారీ చేసిన అధికారులు ప్రజలకు అవగాహన కల్పించలేదు. దీంతో తెల్ల రేషన్‌కార్డుదారులు గతంలో మాదిరిగా 15 తర్వాత కూడా రేషన్ షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. భారీ సంఖ్యలో కార్డుదారులు వస్తుండటంతో డీలర్ల విజ్ఞప్తి మేరకు అతికష్టంపై రెండు రోజుల గడువు పొడిగించిన అధికారులు ఆ తర్వాత ముగించేశారు. ఈ విషయం తెలియని లబ్ధిదారులు రేషన్ షాపులకు వస్తూనే ఉన్నారు. పౌరసరఫరాల శాఖ గడువు కుదింపు నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల మందికి పైగా లబ్ధిదారుల కుటుంబాలు బియ్యంతోపాటు ఇతర రేషన్ సరుకులు తీసుకోలేదని తెలిసింది. ఇక నుంచి వరుసగా 15 రోజులపాటు ఎలాంటి సెలవులు లేకుండా బియ్యం పంపిణీ చేయాలన్న ఆదేశాలపై రేషన్ డీలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



## ఏప్రిల్‌లో తుక్కుగూడలో కాంగ్రెస్ సభ

- **హాజరుకానున్న ఖర్గే, రాహుల్‌గాంధీ**

హైదరాబాద్, మార్చి 23(నమస్తే తెలంగాణ): ఏప్రిల్ మొదటి వారంలో హైదరాబాద్ సమీపంలోని తక్కుగూడలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తున్నది. ఈ సభ ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించనున్నది. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీతోపాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిసింది. ఇటీవలే ఆ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోను ఈ సభలో మల్లికార్జున ఖర్గే తెలుగులో విడుదల చేయనున్నట్లు తెలిసింది.